# దూరపు కొండలు నునుపు

శ్రీమతి ఆచంట సత్యవతమ్మగారు

మనవిద్య మనప్రాచీనౌన్నత్యములు మన మతమును మరపింపజేయునదే పరవిద్యాప్రతిభ. జాతీయత నాదరించనిహిందువు వెట్టివాఁడనగ, కన్నతల్లినిరోసి, సవతితల్లి నపేక్షించునట్టిది. ఎందుచేత ననఁగ హిందూదేశమం దుద్భవించిన మహనీయుల మననమైనను లేక యుపేక్షచేయుటవలన మనహిందూదేశముతక్క తక్కినయూరప్ అమెరికా ఆస్ట్రియా మొదలగు ఖండములను తిలకించుడు ప్రతిదేశముకూడ తమదేశమందుద్భవించిన వీరులనైతేనేమి కవులనైతేనేమి సంఘసంస్కర్తలనైతేనేమి గొప్పఁజేసి వారి నొక నక్షత్రముగా నలంకరింపఁజేసికొందురు. జ్ఞాపకార్థము వారి ప్రతిమలు స్థాపించియు నవయువకుల హృదయోద్దీపిత మొనరించ వారి చరిత్రల ప్రకటించియు ఫొటోలు తీయించి గృహముల నలంకరింపఁజేసికొనియు వేవిధముల వారి నామము ప్రపంచమంత ప్రాకఁజేయుశక్తి భక్తి వారికి మనకంటె చాలగలదు. ఆ అద్భుతశక్తిచేతనే జర్మను ప్రధానమంత్రి హిట్లరుమహాశయుఁడు కీర్తిశేషుఁడైన రష్యనుప్రజానాయకుఁడగు లెనిన్, అమెరికన్ ప్రసిడెంటు రూజువెల్టు, ఇటలీడిక్టేటరగు మస్సోలిని ఆస్ట్రియాడిక్టేటరగు డాక్టర్ డాల్ఫస్ టర్కీ కెమల్ పాషా వగైరాలందరూ కూడ వారివారి దేశోన్నతకార్యములనుబట్టి వారివారి దేశములందేగాక ఖండేతరుల మగు మనహిందువుల నోళ్లలోకూడ నానుచుండుట తటస్థించుచున్నది. గ్రహించితిరా? మంచి యెచ్చటనున్నను ఆదర్శప్రాయమగుటచే ఆదరించుట విధేకాని మనవారల మంచిని మరుగుపరచి మరచిపోవుటకాదు.

ఇంటగెలిచి రచ్చగెలవాలనురీతి మన దేశీయులలో డిక్టేటర్లు, వీరులు, కవులు, గాయకులు, సంఘసంస్కర్తలు యెందరో గలరు: కలుగుచున్నారు. ఈమధ్య జరిగిన శ్రీమహారాష్ట్ర స్థాపకవీరుఁడగు ఛత్రపతి శివాజీ జయంతి జరిపిన సందర్భమున జరిగిన సభా ప్రసిడెంటగు డాక్టర్ జి.సి. అరండేలు యీసంగతే మన దేశీయులకు ప్రబోధించిరని వార్తాపత్రికలు వ్రాయుచున్నవి. ఇఁకనైన మనమ్మృతజీవుల నార్యప్రతిభ నిలబెట్టుఁడు.

ఏదీ, ఆసేతుహిమాచల పర్యంతమేలిన చంద్రగుప్తనామ మేమూలనో కాని దానికి జీవదానమేది? మనహిందూరాజ్య శిఖామణి మమునకుబదులు ఆకాలమునాటివాఁడైన దేశమునందలి భాగములజయించిన గ్రీసు దేశచక్రవర్తి అలగ్జాండరుపేరు మ్రోగుచున్నది. గమనించితిరా విక్రమార్క భోజరాజుల అలికిడే లేదు. అశోకచక్రవర్తి పేరే యిప్పటివాళ్ళకు తెలియదు. ఆంధ్రభోజ

బిరుదాంకితుండై, అష్టదిగ్గజకవికల్పవృక్ష మగు విజయనగర సామ్రాట్టు శ్రీకృష్ణ దేవరాయల చిత్తరువే లేకుండుట కడు శోచనీయము. అప్పటిరాజు లెట్టివీరులో, వారి మంత్రులును నంతటి యుక్తిపరులు, చంద్రగుప్త నంతటి సార్వభౌమునకు చాణక్యునివంటి మంత్రికదా? చాణక్య నీతి యని పేరు. శ్రీకృష్ణదేవరాయల కట్టి తిమ్మరుసుమంత్రి తగియుండెను కదా! విక్ర మార్కునివంటి వీరవరునకుభట్టియే తగిన మంత్రి. ప్రతాపరుద్రుని దెచ్చుటలో కడు యుక్తులంబరపిన మంత్రియుగంధరుని ప్రతిభ కొనియాడ వశమా? ప్రతాపరుద్రుడు, పూర్ణచంద్రుడు, బొబ్బిలివీరులలో పులి యను ఖ్యాతివడసిన తాండ్రపాపయ, ధర్మా రాయ రంగారాయ వెంగళ్రాయాదివీరులు, రసపుత్రసింహములగు రాణా ప్రతాప, రాజసింహ, ఉదయసింహాదులు, వేయేల మనదేశమున నుద్భవించని మహనీయు లే దేశమున లేరనిన యతిశయోక్తికాదు భరత మాత, రత్నగర్భ, కనకగర్భ, రజితగర్భ, వీరగర్భ, కవిగర్భ, సతీగర్భ యని జ్ఞప్తియుం దుంచుకొని, తల్లి నభిమానించిన ప్రతిహిం దువునుకూడ, మనప్రాచీనాధునిక, వీర, కవి పుంగవుల, దివ్యచరిత్ర పఠించుచు, వారల నాదర్శముగాగొని, వారి చిత్తరువుల గృహా లంకారములుగాఁజేసికొని, ఆరాధ్యత్వము నిలబెట్టుదురుగాక. ఝాన్సీ లక్ష్మిబాయి, రుద్రమదేవి, సంయుక్త మొదలగు హిందూ వీరస్త్రీలు, సీతానసూయారుంధత్యాది, పతి వ్రతామణులుకూడ మనలోగలరు. గ్రహిం పుడు.

మన ఘనవక్త, లోకమాన్యబాలగంగా ధరతిలకు, శివాజీవీరుని, బోలతగిన ప్రబోధకుడు, ముప్పదిమూడుకోట్ల దేవతల కింద్రుడైట్టి యధిపతియో, హిందూనాయ కుడగు, మహాత్మాగాంధియట్టివాడు. కొం దరికాలమున ఫొటోలుతీయునేర్పు లేనందున, చెక్కడములే గలవు. అవైన, కాలక్రమ మున సిథిలావస్థంబడి, రూపేలేనందున, మన కా మహనీయు లెట్టివారో కన్పడ నాధరువు లేదు. అయినా, చారిత్రకవర్ణనలబట్టి, రూప మూహించి, రామ, కృష్ణాద్యవతారంబు లును, శివాజి, మొదలగు వీరులయొక్కయు, చిత్తరువు లెట్లు వ్రాయుచుండిరో యట్లే, తది తర, మహనీయులగు, శ్రీకృష్ణదేవరాయ, ప్రతాపరుద్ర, రసపుత్రవిక్రముల, బొబ్బిలి వీరుల, కాళిదాసాది, మహాకవులయొక్క యు, భోజ, విక్రమార్క చంద్రగుప్తాది సార్వభౌముల యొక్కయు, ఊహాకల్పక చిత్రముల లిఖింప, చిత్రలేఖకులఁ బ్రోత్స హించి, యాచిత్తరువులం దభిమానముంచి కొనియు, కవు లట్టివారి చరిత్రలు మరపాం దకుండ వ్రాసియు, నవీనవిద్యార్థు లట్టి దేశ చరిత్రల పఠించియు, దేశోద్ధారకు లట్టివారి యాదర్శప్రాయు లగునట్లు, సంఘమునకు తోడ్పడియు, నాట్యకళాపోషకు లట్టి జాతీయ చారిత్రక నాటకములనే యాడి, మరచిన నాయకుల మరల జ్ఞప్తికిందేవ ప్రార్థించు చుంటిని.

382

ప్రస్తుతము కొంతనయము; ఏ మహానుభావుల వాగ్రూపప్రవాహమహిమోకాని, రాజరాజ నరేంద్రవర్ధంతని, శివాజీజయంతని, త్యాగరాజ గానసభలని, కాళిదాస నాటకమని, శంకరాచార్య మతమని, ఆంధ్రవాణీ సామ్రాజ్యాది నాటకనటనరూపముల కృష్ణదేవరాయుని యశమును, అజంతా, అమరావతీ, మొదలగు గృహా, స్థూపశిల్పచాతుర్యముల, ప్రకటించియు, దేశప్రతిభను పూజించుచున్నారు. ఇంతతోనుపేక్షసేయక, మరియు, మన పుణ్యపురుషులను ప్రతివ్యక్తి మనోఫలకమున హత్తింపఁజేయవలయును.

షేక్స్పియర్ డ్రామారా! అని యుత్సాహంగా పఠించి, రూపకమీమాంసింప ప్రతివిద్యార్థియు వేడలును కాని, నన్నయ, పోతన, శ్రీనాథ, పెద్దన, కాళిదాసాది, కవుల గ్రంథము లుత్సయింపఁ డెందువలన? వారికిచ్చేచదు వట్టిది. వారి దేశీయుల ప్రకట నట్టిది. ఇది గ్రహించి విద్యార్థి, విమర్శనపూర్వకముగా, జాతీయత నిలబెట్టవలెను. మన ప్రాచీనవీరులను మరచితే, మనకొచ్చేది సలామే. మనపూర్వుల కవిత్వధోరణి సణగ ద్రొక్కితే, మనకచ్చేది హూణభాషాపద మిళితమైన గ్రామ్యకు కవిత్వమే. మనఆర్యుల రూపదృశ్యము లంతరించినయెడల, మనకాత్మరూప సందర్శనమే దుర్లభము.

వేదాంతమునకు నిధియగు మనవేదాంతుల నిర్లక్ష్యపరచి, గ్రీసు దేశ వేదాంతియగు శోక్రటీసును స్మరించుచున్నాము. ఎంతాశ్చర్యకరము. ఇదే పొరుగింటి పుల్లకూర రుచియు, దూరపుకొండలు నునుపనుటకు నిదర్శనములు. ఏ పుట్టలో నే పామున్నదోయని, ఇంటిపుట్టలుమాని, బయటపుట్టలు గాలింప భావ్యమా! ఫలమేమి? మరచిన విద్య మననమొనరింపుడు. నమస్కారము. 'మావి పండెంత మధురమై మంచిదైన జీడియుండక పోవునే చివరకొంత' యని కవిసూక్తిగా. తప్పు లెన్నవలదని మనవి.

ఉ॥ రెక్కల నీసడించెడు మరీచుల దిక్కులఁ గ్రిక్కు వ్రజముల్
లెక్కకుమీరి సంద్రములలేవె మనుష్యుల దృక్పథంబులన్
దక్కు; మొవండుసూచె వసుధాస్థలి నున్న మహానుభావులన్
జక్కఁగ లెక్కసేయుటలు శక్యమె వారలు నెందరెందరో.

'దాసుఁడు'